

# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జులై 2012

సంపుటి : 18 **210** సంచిక : 7




# స్వర్ధాభావం సమాజ సాంస్కృతిక జీవన మూలాలను పెకలించి వేస్తూంది!!!

స్వార్థం సుతిమించితే అనేక అనర్థాలకు దారితీస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత అనండి, ఆంధ్రభాషా రాష్ట్రం సిద్ధించిన అనన్తరమే అనండి – అన్ని ప్రాంతాలలోనూ, అన్ని రంగాలలోనూ కొన్ని స్వార్థపరశక్తులు సమాజంలో ప్రయత్నపూర్వకంగా విభేదాలను సృష్టిస్తున్నాయ్, అలజడులను రేపుతున్నాయ్. పరస్పర స్పర్థ ఉండడం కొన్ని విషయాలందు మంచిదే! **స్పర్థయా వర్థతే విద్యా!** అనే ఒక నానుడి ఉన్నది. విద్యలో అభివృద్ధి సాధించడానికి విద్యార్థుల మధ్య పోటీ (స్పర్ధ) ఉండడం మంచిది. దేశాన్ని అభివృద్ధి చేయడంలో నాయకుల మధ్య పోటీ ఉండడం మంచిదే! కానీ, ఆ పోటీ (స్పర్ధ) దేశాన్ని దోచుకోవడంలో ఉండకూడదు. కానీ ప్రస్తుతం జరుగుతున్న స్పర్ధ దోపిడియే! ఒక క్షేత్రాన్ని (ప్రాంతాన్ని) అభివృద్ధి చేద్దామనెడి సంకల్పం లేకపోగా, ఉన్న సంపదలను వనరులను పోటీపడి దోచుకుందామని ప్రతి నాయకుడూ పోటీపడుతున్నాడు. అంతేగానీ పరస్పర సహకారం భావం, ఏకతాభావంతో దేశాన్ని అభివృద్ధి చేద్దాం. కూడూ, గుడ్డా, గూడూ అందరికీ సమకూరేట్టు చేద్దాం. దేశం బాగుంటే మనం బాగుంటాం అనే ధ్యాస ఏ నాయకునికీ, ఏ కోశానా లేకపోవడమే, ఈ క్లేశాలన్నిటికినీ ఈ స్పర్ధ స్వైర్యవిహారం చేయిస్తూంది.

వర్గవర్ణాదులకు సంబంధించిన ఉచ్ఛ నీచభావాన్నీ, అస్పృశ్యతాభావాన్ని అన్యమత ద్వేషాన్నీ (ముఖ్యంగా స్వమతద్వేషాన్నీ) పౌరుల మనస్సుల నుంచీ తొలగించాలి. మానవతపై మాననీయత, దేశసమైక్యభావాన్నీ నాయకుల్లో పెంచి పంచేవారు లేకపోవడమే ఈ దేశం చేసుకున్న దురదృష్టం.

ఏనాటికీ తీర్చశక్యం కాని సుఖభోగాభిలాష, ధనదాహం, అధికారవ్యామోహం ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రాన్ని పట్టి పీడుస్తున్న పీడ.

కాలాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టీ, జాతిని బట్టీ, మతాన్ని బట్టీ, వర్ణాన్ని (కులం) బట్టీ తెలివి తేటల్లో తారతమ్యాలు లేవు. అవిద్యావంతులలో లేవు. జ్ఞానం, సయోధ్య పరిస్థితులూ, పరిసర వా(ర్తా)తావరణం బట్టి కొందరిలో మంచితనం వికసిస్తుంది, కొందరిలో వికసించడంలేదు, ఆ వికాసం లేనివారి కారణంగానే రాష్ట్ర వినాశనం చిగుళ్ళు తొడుగుతున్నది.

భారతీయ ఆధ్యాత్మిక స్వరూపాన్ని, శౌర్యసాంస్కృతిక ధర్మాలనూ సరళంగా చెప్పిన భగవద్గీతలో అర్జునునితో కృష్ణ పరమాత్ముడు హితోక్తిగా పలుకుతూ:

**ఆత్మౌపమ్యేన సర్వతసమం పశ్యతి, యోఽర్జున**
**సుఖం వాయది వా దుఃఖం స యోగీ పరమోమతః!**

ఓ! అర్జునా ఎవరి సుఖమైనా దుఃఖమైనా తను పొందే సుఖదుఃఖాల వంటివేనని భావించేవాడు. పరమయోగి (అతిమంచివాడు) యని నా అభిప్రాయం! అన్నాడు.

ఆ భావననే పంచమవేదమైన మహాభారతం కూడా–

**ఒరులేయని యొనరించిన**
**నరవర అప్రియము, తన మనంబునకగు తా**
**నొరులకు నని సేయకునికి**
**పరాయణము పరమధర్మ పథములకెల్లన్** – అని వ్యక్తపరిచింది.

మన తెలుగువాళ్ళు భారత, భాగవత, రామాయణ గ్రంథాలను చదవరు. సూక్ష్మంగా సూటిగా పద్యాలు కల నీతి శతకాలను చదవరు, పిల్లలచే చదివింప చేయరు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలుగా చెప్పరు. ఎన్ని అంతస్తుల భవనమైనా పునాది పటిష్ఠంగా లేనప్పుడు నిలువదు. సాంస్కృతిక మూలాలు, నీతి ధర్మాలు, జాతి ఔన్నత్యం ఎరుగని మనిషి తాను ఎదుగడు, ఇతరుల నెదుగనీయడు.

తోటకూరనాడైనా చెప్పనైతినిరా కొడకా– యని ఇలాటి నీతి విజ్ఞాన విశారద తను పిన్న వయసులోని పిల్లల హృదయ క్షేత్రాల్లో విత్తనములు చల్లినట్టు చల్లితే, ప్రమాదవశాత్తూ తప్పు చేసినా సరిచేసుకుంటారు.

'స్పర్ధయా వర్ధతే విద్యా' అన్న చందాన, ఒకరికంటె మరొకరు మంచి 'మార్కులు' రావాలని పోటీపడతారు. జీవితంలో 'రిమార్కులు' రానివ్వదు. తప్పులు చేయరు, తను, తనవారు తన పొరుగువారు అందరూ సుఖంగా, క్షేమంగా ఉండాలని, సమాజ సాంస్కృతీ వికాసానికి మార్గదర్శకు లౌతారు.

సమాజం, సమాజంతో పాటు దేశం సర్వతోముఖంగా వర్ధిల్లుతుంది. ఇప్పుడున్న విషనాగులు వంటి వారిని కోరలు తీసి కూర్చోబెడతారు.

ఆ మంచి రోజు వస్తుందని ఏరోజుకా రోజు ఎదురుచూద్దాం.



బుధజన విధేయుడు

*గోటేటి శ్రీరామారావు*

**ముఖచిత్రం**

**దక్షిణామూర్తి, జ్ఞానప్రదాత ఆయన అనుగ్రహంతోనే, భారతదేశం విజ్ఞానభూమి కాగలిగింది.**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

*విశాఖ సాగర తీరంలోని భీముని పట్నంలో ఆనందవనం, సనాతనధర్మ చారిటబుల్ ట్రస్టులను నెలకొల్పిన ఋషివరేణ్యుడు సద్గురు కందుకూరి శివానందమూర్తి మహోదయులు. సర్వజనహితైషులు. ఆయన్ను దర్శిస్తే చాలు 'భారతీయత' ఉట్టిపడుతుంది. అంత నిరాడంబర మూర్తీ నిలువెత్తు ఆత్మీయత, వాత్సల్యమూ, సమాజసేవ చేసే ఋషితుల్యులు మరొకరు లేరంటే ఆశ్చర్యపోనవసరం లేదు. తాను ధర్మ మార్గంలో నడవడమే గాకుండా నడపడమే ధ్యేయంగా పెట్టుకుని ఆచరిస్తున్న ఏకైక ముని సత్తముడు. వేళ్ళూనిన 'భారతీయత'ను, మహర్షుల గ్రంధ రచన ద్వారా 'సమాజానికి తెలియచేయడమే కాకుండా, అక్షర శూన్యమూ, అమాయకత్వము గల అడవి జనులను కూడా ధర్మమార్గంలోనికి తీసుకుని వస్తున్న ధర్మపురుషుడు. ఆయన్ను చూస్తుంటే 'మానిషా పంచకం' రచించి జ్ఞాననేత్రం తెరిపించిన ఆదిశంకరులా? రామకృష్ణ పరమహంస వారసుడైన వివేకానందుడా, మనిషిలోని మృగత్వాన్ని తొలగించిన గౌతమబుద్ధుడా, మిధిలాపురి 'రాజర్షి' జనకమహారాజా, నరనారాయణుల అవతారమా, గరళకంఠుడైన పరమేశుడా- యనెడు పరమ పూజ్యభావం కలుగుతుంది. సాధారణ పంచెకట్టూ, లాల్చీ పైన అంచుల కండువా, నెన్నుదుర్న వీభూతి అడ్డరేకలూ, నడుమ ఎర్రటి సూర్యబింబంలా కుంకుమ బొట్టు, పలువరసల నుంచి జాలువారే స్మిత వదనమూ చూస్తుంటే కైలాసగిరినుంచీ పరంధాముడే దిగివచ్చాడనే అనిపిస్తుంది. ఆ చేతులు రెండూ యివ్వడానికే యిచ్చగిస్తాయిగానీ, గ్రహించడానికొప్పవు. రాష్ట్ర పరిస్థితిని చూచి చలించిన ఆయన హృదయాన్ని ఇక్కడ ఆవిష్కరిస్తున్నాం.*

# అవినీతి పిశాచాన్ని వదిలించడం ఎలా?

**మా**నవుడికి ఆపదలు రాకుండా రక్షించే శక్తి ఏమిటి? ఆ శక్తి పేరు వివేకము. మనుష్యుల జీవితంలో చెడ్డరోజులు వచ్చినప్పుడు మొదటగా వివేకం పోతుంది. ఇది ఎంతవాడికైనా సిద్ధాంతమే. బంగారు లేడిని చూసిన సీతకు, అట్లాంటి జంతువు ఉండడము ప్రకృతి విరుద్ధమని, అది అనుమానించదగినదని తోచలేదు. అది నిజమని నమ్మడం, అది కావాలని కోరుకోవడము- అదే వివేకభ్రష్టత్వము. అక్కడ క్షణాల్లో ఆపద పొంచి ఉన్నది.



మనుష్యుడు స్వస్థతతో ఇంటి నీడన కాలం గుడుపుతున్న కాలంలో ఉన్నట్లుండి బుద్ధిలో వికారం ఒకటి ఏర్పడుతుంది. అది సముచితంగా, లోక సామాన్యంగా ధర్మబద్ధంగా ఉండదు. ఆ లక్షణంతో బుద్ధినుంచి పుట్టిన కథ త్వరగా పెరుగుతుంది. ఆ వ్యక్తి ఆపదలపాలు కావలసిందే! ఇది సుఖ జీవనం చేస్తున్న వాడికి ఎప్పుడైనా సంభవించవచ్చు!

నేడు మనదేశంలో వందలాది ప్రముఖ వ్యక్తులకు ఈ విపరీత బుద్ధి పుట్టి వివేకాన్ని నాశనం చేసి, వేగంగా వాళ్ళ దుర్బుద్ధిలో పుట్టిన కార్యక్రమాన్ని అమలు జరిపించి, వాళ్ళను సర్వనాశనం చేస్తున్నది. వీరు అవినీతి, ధనాశ, దురాశ, పేరాశ, అనే ఆశాపిశాచగ్రస్థులై దీనిని వదిలించే మాంత్రికుడు దొరకక, జీవితాలలో తిరిగి లేచి నిలుచునే అవకాశాలు లేక నాశనమయినారు. ఈ ధనాశా పిశాచగ్రస్థులైనవారు అందరూ ధనం లేని పేదలు కారు. దరిద్రం వంటి కష్టాలలో ఉన్నవారు కారు. అందరూ ధనవంతులే. వాళ్ళ దురదృష్టం వాళ్ళలో అవివేకాన్ని సృష్టించి, తప్పుచేయడానికి కావలసిన అవకాశాలు కల్పించి, ధనరాశులను ఎరగా చూపించింది. వాళ్ళ విధి వాళ్ళను నాశనం చేసింది.

దేశ వ్యాప్తంగా, ఢిల్లీ నుండి కర్నాటక దాకా ఇదే అంతులేని కథ. దేశంలో బొగ్గు సరఫరా నుంచి మన సేనలకు ట్రక్కులు కొనుక్కోవడం దాకా ఎన్నో ఎన్నో కథలు. ఇదంతా యావద్భారతానికి అపకీర్తి పతాకం. ఈ వ్యక్తులు పెద్దస్థాయికి కొన్ని దశాబ్దాల పరిశ్రమతో ఎదిగినవారు. విధి కొండ చివరిదాకా తీసుకెళ్ళి ఆ శిఖరం నుంచి పడేస్తుంది. అప్పటికి కాని ఆ దుష్టశక్తికి తృప్తికలుగదు. మొత్తం దేశంలో వెయ్యిమంది అవినీతితో జైళ్ళపాలైతే నష్టం ఎవరికి? వాళ్ళ వ్యక్తిగత జీవితాలు సర్వనాశనం కావడం ఎలాగూ తప్పదు. వెయ్యి మంది జీవితాలైతే మాత్రం దేశానికి ఏమి లోటు? ఒక వ్యక్తి పదివేల కోట్లు సంగ్రహించాడనుకోండి. దాని ఫలితంగా వాళ్ళ నాశనం తప్పడం లేదు. ఆ ధనం యొక్క నష్టం ఇంత పెద్ద భారతదేశానికి హాని చేసేటంత ఆర్థిక నష్టం కానేకాదు. లక్షకోట్లు దొంగిలించినా భారతదేశానికి దరిద్రం వస్తుందా? రానేరాదు. ఒక్కమాటు దేశవ్యాప్తంగా వందలాది వ్యక్తులు మూకుమ్మడిగా తస్కరించిన ధనం వల్ల దేశానికి ప్రపంచ దేశాల మధ్య కీర్తి నష్టమవుతుంది. బ్రిటన్, అమెరికా వంటి దేశాలలో మన స్థాయిలో కరప్షన్ అనే మాట ఉండనే ఉండదు. ఎప్పుడైనా ఒక కేసు జరుగవచ్చు. నిత్యకృత్యంలో, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాజీవనం వీటి మధ్య అటువంటి అవినీతి ఉండదు. పెద్ద పదవుల్లో ఉన్న వాళ్ళు అవినీతితో మనదేశంలోవలె అపార ధనం సంపాదించడం జరగదు. అటువంటి దేశాలున్న ఈ ప్రపంచంలో భారతదేశం సంపాదించుకున్నవి అపకీర్తి, గౌరవ హాని. ఇది విదేశాలలో భారతీయులకు తలవంపు. అంతర్జాతీయ దేశాలలో భారతదేశానికి గొప్ప నష్టదాయకం. విదేశాలనుంచి లక్షల కోట్ల పెట్టుబడితో వ్యాపారపు ఒప్పందాలు ఎన్నోఉంటాయి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకుంటాయి. రెండు సంవత్సరాల తరువాత ఒప్పందంలో భారతీయుల అవినీతి బయటపడుతుంది.ఒప్పందం భారత ప్రభుత్వం రద్దు చేస్తుంది. అట్లాంటి ఒప్పందాలకు, దేశంలోపల జరిగిన వాటికి కూడా అదే గతి. చాలా పెద్ద ఎత్తున వ్యాపార ప్రణాళికలు రూపొందుతాయి. ప్రభుత్వం మంజూరుచేస్తుంది. ఒప్పందం కుదుర్చుకుంటుంది. వేల ఎకరాల భూమి ఇచ్చేస్తుంది. పెద్ద వ్యాపారస్తులు పెట్టుబడి పెట్టేస్తారు. ఆ సంస్థ పని ప్రారంభిస్తుంది. చాలా ధనమూ, కాలమూ వ్యయమవుతాయి. ఉన్నట్టుండి బయటపడ్డ అవినీతి ఒక్క క్షణంలో ఆ కార్యక్రమాన్ని చంపేస్తుంది. ఇచ్చిన భూములు ప్రభుత్వం వెనుకకు లాక్కుంటుంది.

మన రాష్ట్రంలో 26 జీవోలు ఒక్క దెబ్బన రద్దుచేశారు. ఇది అవినీతిని నిర్మూలించే విధానమా? ఇందులో ఎన్నో వందల మంది ఉద్యోగులూ. పెట్టుబడులే నష్టపోవచ్చు. ఇది ప్రజా సంక్షోభం కాదా? కేంద్ర ప్రభుత్వం 2జి, 3జి పేర్లతో మంజూరు చేసిన లక్షల కోట్ల విలువలు కలిగిన ప్రణాళికలు, వ్యాపార ఒప్పందాలు హఠాత్తుగా రద్దుచేసి ఎందమందిని నష్టపెట్టాయి? 230 ఒప్పందాలు రద్దు అయినాయి. మనవాళ్ళకు లంచమిచ్చిన విదేశీయులు భారతీయ విధానాల మీద నమ్మకం పోగొట్టుకున్నారు. దేశానికి విదేశీయుల నమ్మకం నష్టమైనది. ఇలా నష్టపోయిన విదేశీ వ్యాపారస్తులు కాని, మన దేశస్తులు కాని ఎందుకు ప్రతిఘటించడం లేదు? వాళ్ళవి లంచం ఇచ్చిన చేతులు కాబట్టి! ఇది మన భారతదేశ పరిపాలనా వ్యవస్థకు తీరని మచ్చ.

దేశంలో ప్రజలకు ప్రభుత్వ మీద పూర్తిగా నమ్మకం పోయింది. ఏ పెద్ద ప్రణాళికా అమలు అయ్యేదాకా నమ్మకం లేదు. నేటి భారతదేశంలో నీతిమీద నమ్మకం లేనివాడు ప్రభుత్వంలో ఎంతో ఉన్నత స్థాయికి సులభంగా వెళ్ళే అవకాశం దేశంలో సమృద్ధిగా ఉంది. అదీ మన రాజకీయ వ్యవస్థ. ప్రభుత్వాల నిర్మాణంలో ఉండే పద్ధతుల్లోనే తీవ్రమైన లోపాలు ఉన్నాయన్నమాట!

మన రాష్ట్రం విషయం ఒక్కమాటు పరిశీలిద్దాము. ఒక ముఖ్యమంత్రి, ఒక పార్టీ, అనేక మంది యంత్రాంగం, ఉన్నతోద్యోగులు, అనేకమంది మంత్రులు అందరూ కలిసి అవినీతి పాలయ్యారని, ఎన్నో తప్పులు గల నిర్ణయాలు తీసుకున్నారని, ప్రభుత్వ అనుమతులు ఇవ్వబడ్డాయని అంతా అవినీతిమయంగా కథ నడిచిందని, ఆ కథంతా ప్రజల ముందుకు వచ్చింది. ముఖ్యమంత్రితో మొదలుపెట్టి, మంత్రి మండలి, ఉన్నతాధికారులు అందరూ కలిసి చేసిన తప్పు ఎవరో కొందరు వ్యక్తులు చేశారని చెప్పడం తప్పు. అన్ని తప్పులూ రాష్ట్ర ప్రభుత్వం చేసిందనే చెప్పాలి. ప్రభుత్వం నీతిమాలిన పని చేసిందని అంటే, వ్యక్తుల శిక్షతో సరిపోతుందా? వ్యక్తుల అవినీతికీ, మొత్తం ప్రభుత్వమే చేసిన పనికీ వ్యత్యాసం ఉంది. అలాంటప్పుడు ఈ తప్పులన్నీ బయటపడగానే, వంద మందిని ఒకరి తరువాత ఒకరిని వ్యక్తిగతంగా శిక్షించడం కంటే, అధికారికంగా, తాత్కాలికంగా ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఏ రాష్ట్రపతి పాలననో విధించి, అసెంబ్లీని నిలుపుచేసి, ఈ తప్పులన్నీ సరిదిద్ది, వీలైనంత మందిని ఉద్యోగాలనుంచి తొలగించి, ఇళ్ళకు పంపించి, అన్ని జీవోలను సవరించి, ప్రజాహిత కార్యక్రమాలను రద్దు చేయకుండా క్రమబద్ధీకరించి ఒక క్రొత్త వ్యవస్థను సృష్టిస్తే ఎలా ఉండేదో? అలా చేసి ఉంటే, తప్పులన్నీ సవరించమని పోలీసువారి చేతుల్లో పెట్టకుండా ఒక రాజకీయ ప్రణాళికగా జరిగి ఉంటే, నేడు జరుగుతున్న సవరింపులు హింసా రహితంగా ఉండేవేమో! ఇంతాచేసి పోలీసు మార్గంలో అవినీతిని నిర్మూలన చేద్దామనుకుంటే అప్పుడుకూడా దానికి ఎంతో ప్రతిఘటన వస్తుంది. దీనిని ప్రతిఘటించేవారికి ప్రజలలో సానుభూతిపరులూ ఉండవచ్చు. మద్దతుదారులు ఉండవచ్చు. సమాజము విభక్తమవుతుంది. ఇదంతా సామాజిక సంక్షోభమే!

ఇంత పెద్ద పరిమాణంలో జరిగిన రాజకీయ అవినీతిని, సరిదిద్దే అవకాశం రాజకీయ విధానంలో తప్పక దొరకగలదు.పోలీసు, దర్యాప్తు, కేసు, కోర్టు, ఇవన్నీ మన క్లిష్టమైన విధానాలతో శిక్షకు దారితీయవచ్చు. శిక్షలుపడకపోవచ్చును కూడా. ఇలా కాకుండా నేరస్థులందరూ నేరాన్ని ఒప్పుకొని, అధికారం వదులు కొని, అక్రమాస్తులను ప్రభుత్వాల కప్పగించి, స్వయంగా వెళ్ళిపోయేట్టు చేయడం ఎలాగన్నది ఆలోచించాలి. అలాగే, లక్ష చేసే ఎకరం, పదివేలకు ప్రభుత్వం ఎవరికైనా ఇస్తే, దాని నిజమైన విలువ వసూలు చేసే అవకాశం ఉండాలి. పెద్దలందరూ ఆలోచిస్తే ఒక నాగరికమైన విధానంగా ఒక ప్రభుత్వాన్ని సంస్క రించే విధానం మన రాజకీయ వ్యవస్థలో తప్పకుండా దొరకగలదు. జపాన్ వంటి దేశాలలో ఇటువంటి విధానాలు అవలంభించిన సంఘటనలు ఉన్నాయి. నేరం ఒప్పుకోవడం, అవినీతి ధనాన్ని ప్రభుత్వానికి స్వయంగా అప్పగించడం అసాధ్యమైన విషయం కాదు.

ఇప్పుడు మాత్రం దేశాన్ని మొత్తంగా బాగుచేసేది పోలీసు వ్యవస్థయే అని మనం నమ్ముతున్నట్లు కనబడుతుంది. అది చాలా కాలయాపన, హింస, అని శ్చిత ఫలితాలతో కూడుకున్నది. నేరానికి శిక్ష మాత్రమేకాక, వ్యక్తి సంస్కరించ బడటం, అప్పుడు శిక్షించబడటం, క్షమించబడటమూ మన నాగరికతలో భాగమే.

**చివరి మాట.** మనుష్యుడు ఎప్పుడూ వివేకాన్ని కోల్పోకూడదు. తనకు అవసరమేలేని ధనము, అలాగే అవినీతి మార్గంలో ఒక స్త్రీ గాని, అధికారం గాని కంటబడటం ఇవన్నీ మనిషిని వివేకహీనుణ్ణి చేసి ఆపదలపాలు చేసే దుష్టశక్తులు. దేశంలో అందరికీ వివేకం కలగాలంటే, మనం నమ్ముకున్న ఈశ్వరుడే దయచేయాలి. మరో మార్గం కనబడదు. మన దేశంలో అతి వైభవంగా జరుగుతున్న వందలాది మతపరమైన ఉత్సవాలు ఇలాంటి ఫలితాలను మనకివ్వాలని ఆశిద్దాము. శివో రక్షతు. **– సద్గురు శివానందమూర్తి**

## ఎన్టీయార్ సమయపాలన...



ఎన్‌టిఆర్ పరిశ్రమలోకి అడుగుపెట్టక ముందు హీరోయిన్స్ అంతగా సమయపాలనను పాటించేవారు కాదు. వారి పద్ధతి ఎన్‌టిఆర్‌కి నచ్చేది కాదు. ఒకనాడు ఎన్‌టిఆర్ నటిస్తున్న చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఏడుగంటలకే అందరూ సిద్ధమయ్యారు ఎన్‌టిఆర్ కూడా సరిగ్గా ఏడుగంటలకే వచ్చేసారు. కాని హీరోయిన్ పదకొండు గంటలకు కాని రాలేదు. ఆమె రాగానే ప్రొడక్షన్ మేనేజర్‌ని పిలిచి...

"ఇవాళ హీరోయిన్ కాల్షీట్ మనదేనా...?"అడిగారు.

'మనదే సార్'

"నిన్న మళ్లీ ఆవిడకు గుర్తు చేశారా?"

'చేశానండి'


'షెడ్యూల్ పేమెంట్ ఇచ్చారా'

'ముందే ఇచ్చామండి'

అప్పుడు హీరోయిన్ వైపు తిరిగి "అతను చెప్పింది నిజమేనా?" అడిగారు.

"నిజమేనండి" చెప్పింది హీరోయిన్.

"మరెందుకు ఇంత ఆలస్యంగా వచ్చారు. నిర్మాత మనకు పారితోషికం ఇస్తున్నది తాను నష్టపోడానికి కాదు. డబ్బులు తీసుకుంటున్నాం. విశ్వాసంగా పని చెయ్యాలి" అని కాస్త గట్టిగానే అన్నారు. ఆ తర్వాత ఏ హీరోయిన్ లేటుగా రాలేదు. ఎన్‌టిఆర్ నటించే చిత్రాల షూటింగ్‌కు అసలు ఎవరూ ఆలస్యంగా వచ్చేవారు కాదు. అది ఆయన సమయపాలన. అలాగే తన పారితోషికాన్ని కచ్చితంగా వసూలు చేసేవారు.



# షోడశ కళాప్రపూర్ణుడైన భగవంతునికి పదహారు వందనాలున్నాయ్!
## - 'అతిథిదేవోభవా'లో కూడా అవే చెప్పారు!-



భారతీయుల రక్తంలో మేళవించి పారుతున్నది వందనమూ, కృతజ్ఞత. ఉత్కృష్టమైన మానవ జన్మ ప్రసాదించిన భగవంతుని కెంతో ఋణపడి ఉన్నాం. ఆ సృష్టికర్త మానవజన్మలో భారతదేశంలో పుట్టిన వారి జన్మ ఉన్నతమైనదని, భారత భూగడ్డలోనే మాననీయ మానవున్ని ఎంచుకుని అవతారములు దాల్చాడు. ఆంధ్ర దేశంలో అనేక ప్రదేశముల్లో అవతారము ధరించడమే కాకుంగా, అనేక ప్రదేశముల్లో స్వయంభువునిగా వెలిసాడు.

ఆ షోడశ కళా పరిపూర్ణునికి సంగీతమంటే ప్రాణం. సంకీర్తనమునకు సంబరమందినట్లుగా దేనికీ ఆయన సంబరపడడు, సంతృప్తి చెందడు; సాక్షాత్కారమివ్వడు, భగవంతుని అనుగ్రహం పొందడానికి, షోడశ కళా ప్రపూర్ణుడైన ఆయనకు షోడశోపచార పూజల్ను పెద్దలు నిర్దేశించారు.

షోడశమనేది సంస్కృత మాట. అంటే తెలుగులో పదహారు అని చెప్పుకుంటాం. సంస్కృతంలోనూ, తెలుగులోనూ పదహారు సంఖ్యకు ప్రత్యేకమైన విలువ ఉన్నది, విశిష్టత ఉన్నది. ఆ రోజుల్లో ఏ దానధర్మాలు చేసినా, వరునికి కట్న కానుకలిచ్చిననూ చివర 16 ఉంటుంది. ఉపనయనం చేసినా, వివాహం చేసిననూ పదహారు రోజుల పండుగను జరపాలి. అలాగే భగవంతునికి చేసే పూజల్లో కూడా షోడశోపచారయుక్తంగా అంటాం. అంటే పదహారుకే విశిష్టత యిచ్చాం. ఆ రోజుల్లో రూపాయకు పదహారణాలను యిచ్చారు. అందుకే పెద్దలు మేము పదహారణాల ఆంధ్రులం అని చెప్పుకుంటూ గర్వపడేవాళ్ళం.

దేవుణ్ణే కాదు, మన యింటికి వచ్చిన అతిథిని కూడా అతిథి దేవోభవా– అంటూ ఆయనకూ అలాటి షోడశోపచారములనే చేసే అలవాటు పాత తరం వారిలో ఉండేది.

ఏంటిటయా– ఈ పదహారు సేవా ఉపచారాలని అడిగినపుడు భగవంతుని పట్ల గల భక్తి ప్రపత్తులతో ఆచరించదగినవే.

**మొదటిది 1.ధ్యానావాహన.** భగవంతుణ్ణి ముందు ఆహ్వానించడం, ఇంటికి వచ్చిన అతిథిని కూడా రండి రండి అని ఆహ్వానించడం.

**రెండవది 2. ఆసనం.** భగవంతుడైతే ఓ పీటను వేసి అందా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తాం. అతిథియైతే కుర్చీయో, చాపయో కంబలీయో వేసి ఆసీనుణ్ణి చేస్తాం.

**మూడవది3.పాద్యం:** కాళ్ళు కడుక్కోవడానికి నీళ్లు యిచ్చి, శుభ్రమైన తువాలు నిచ్చి శుద్ధం చేసుకోమంటాం. అదే భగవంతుని ప్రతిమకు నీటితో పాదప్రక్షాళయామి, హస్తం ప్రక్షాళయామియని ఉద్ధరణితో నీటిని అభిషేకించి శుభ్రపరుస్తాం. దీనినే 'పాద్యం' అంటాం. ఓ చిన్న గిన్నెను భగవంతుని చెంత ఉంచి అందులో భగవంతుని విగ్రహ పాదాలనుంచి భక్తితో కడిగి, శిరస్సునభిషేకించుకుంటాం. అదే పాదప్రక్షాళనం.

**4.అర్ఘ్యం:** హస్త ప్రక్షాళనం చేసి, సేవించడానికి ఉపయోగించే పవిత్ర జలాలను అర్ఘ్యం అంటాం.

**5.మధుపర్కం:** వచ్చిన అతిథికి తీపి పానీయ మొసగినట్లు భగవంతునికి తేనెతో కలిపి ఏ నూలునైనా, పదార్థమైనైనా సమర్పించి మధుపర్కం అంటాం.

**6.స్నానం:** అటు తరువాత అతిథినైతే ఆహ్వానిస్తాం. దేవతా విగ్రహాలైతే పాలు, పెరుగు, తేనె, నెయ్యి గంధజలములతో స్నానం చేయిస్తాం. లేనపుడు గంగాజలం, అవీ లేనపుడు శుద్ధమైన జలస్నానం.

**7.వస్త్రోపవీతం:** స్నానానంతరం వస్త్రాలను సమర్పిస్తాం.

**8.గంధం:** నుదుట గంధంతో అలంకరిస్తాం. ఎంతో పూర్వం నుంచీ వస్తున్న శుభాచారం.

**9.పుష్పం:** రకరకాల పూలతో 108గానీ, 1008గాని సంఖ్యలో భగవంతుని నామాలను చెబుతూ భక్తితో అర్చన చేస్తాం. అదే ముఖ్యాతిథి, పెద్దవారూ అయితే పూలదండను వేస్తాం (ప్రస్తుతం పుష్పగుచ్ఛాలనే ఇస్తున్నాం).

**10. ధూపం:** ఇది సుగంధభరితమైన ధూమం. ఇది అగరవత్తులు కావచ్చు. సుగంధభరితమైన ఆయుర్వేదమూలికా చూర్ణం కావచ్చు. భగవంతునికి చాలా అవసరం.

**11.దీపం:** భగవంతుడు జ్యోతిరూపంలో సాక్షాత్కరిస్తాడనే విశ్వాసంతో వెలుగుతూండే దీపాన్ని చూపిస్తాం.

**12. నైవేద్యం:** భగవంతునికి వివిధ రకములైన వంటకములను అరిటి ఆకులోనో, వెండి కంచంలోనో అమర్చి నివేదిస్తాం.

**13. తాంబూలం:** ఆయుర్వేదశాస్త్రానుసారం అనండి, ఆచారపద్ధతి అనండి, నైవేద్యానంతరం తాంబూలం, వక్కలు, సున్నం వగైరానివ్వాలి.


**14.హారతి:** అన్నీ యథావిధిగా చేసిన తరువాత కర్పూర హారతి యివ్వాలి. భగవంతుని దర్శనం మంగళకరంగా దర్శించిన అనుభూతి కలుగుతుంది.

**15.మంత్రపుష్పం:**యథావిధిగా ఆయన అనుగ్రహంతో పూజ జరిగినందుకు మంగళకర స్తుతితో ఆయన కీర్తించి ఆ పుష్పాలను ఆయనకు సమర్పించాలి.

**16. ప్రదక్షిణం:** భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు కాబట్టి ఆయనకు కృతజ్ఞతా నమస్కారం చెబుతూ ముమ్మారులు చుడుతూ నమస్కరించాలి. ●

# బంగారం పండేటి భరత భాగ్యసీమ - బంగారాన్నే తాకట్టు పెట్టింది!

## తెలుగువాడు పి.వి. నరసింహారావు ప్రధానమంత్రి కావడంతో తాకట్టు విడిపించడం జరిగింది!



**బంగారం పండేటి మా భరత సీమలో భాగ్యాలు కలుగాలి భగవానుడా!**
**బ్రతుకు భాగ్యంబు కావాలి భగవానుడ - సూర్యభగవానుడ!**

అనే పాటను పల్లెల్లో మాచిన్నతనంలో పిల్లలు అందరూ కలిసి పాడేవారు.

భారతదేశంలోని భూమి పొరల్లో బంగారు లోహపు మట్టి దొరికేది. దాన్ని ప్రక్షాళనం చేసి, వేల సంవత్సరాల క్రితమే బంగారం తయారుచేసేవారు.

హంపీ విజయనగరం రాజుల కాలంలో బజారుల్లో రత్న, మాణిక్యాలతో బంగారు ఆభరణాలు రాశులుగా పోసి అమ్మేవారు. అదంతా శృంగేరీ జగద్గురువులు విద్యారణ్యస్వామి వారి అనుగ్రహం. ఆయన శారదా వరప్రసాదులు. శారదాదేవిని బంగారంతో రూపొందింపచేసిన శివానుగ్రహమూర్తి. ఐశ్వర్యానికి అధిదేవత పరమశివుడే! పరమశివుని అవతారంగా, ఆదిశంకరభగవత్పాదుల అంశగా విద్యారణ్యుల వారిని చెబుతారు. విజయ నగరస్థాపనకు ఆశీస్సులే కాదు, విజయనగర సామ్రాజ్యం స్వర్ణమయమైనది వారి అనుగ్రహంతోనే! రాయల వంశీకులు తిరుమల

వేంకటేశ్వరస్వామి ఆలయాలతో బాటు అనేక ఆలయాల మూలవిరాట్టులకూ, ఉత్సవమూర్తులకూ అమూల్యమైన బంగారు ఆభరణములు చేయించారు, ఆ రోజుల్లో రాజులు బంగారు నాణెములు ముద్రించినారు. అదంతా భారతభువిలో పండిన బంగారమే. గజనీ ఘోరీ వంటి వారు భారతదేశంపై దండెత్తి వచ్చి మన ఆలయాల్లోని బంగారు ఆభరణాల్ను దోచుకొనిపోవడానికి ప్రధాన కారణం బంగారమే! ఆ రోజుల్లో స్త్రీలు అర్ధరూపాయపరిమాణంలో బంగారు కాసుల పేరులు ధరించేవారు. పెద్ద మందమైన రేకుతో వడ్డాణములు, గట్టి బంగారు కడ్డీతో మెడలో కంటెలు, మోచేతి వరకూ బంగారు గాజులూ ధరించేవారంటే అది పుణ్య భారత భువి పసిడి ప్రభావమే!

కాకతీయ రాజులు, రెడ్డిరాజులు వరుసపవేది విద్యతో బంగారం తయారు చేసినట్లు 'ప్రతాపరుద్రచరిత్ర' వంటి గ్రంథాల్లో ఉన్నది. వేమన మహాశయుడు తన అన్నగారిని జైలునుంచి విడిపించుకుని రావడానికి బంగారం చేసి తీసుకు వెళ్ళినట్టు చరిత్రే చెబుతున్నది. పురాణాలు తిరగవేస్తే భారతదేశంలో బంగారం తయారుచేసిన చరిత్రలు కోకొల్లలుగా కనిపిస్తాయి.

**వరుసమున సోకి లోహంబు పసిడియైన పగిది'** అని రుక్మాంగద చరిత్రలో ఉన్నది.

మహాభారతంలో కూడా దుర్యో ధనునికి వరుసవేది విద్య తెలుసునని విపులీకరించబడింది. సత్రాజిత్ ఈ విద్య కారణంగా 'శమంతకమణి' ద్వారా బంగారం పొందబడినట్లున్నది. 'అభివాద చింతామణి' గ్రంథంలో కూడా వేమారెడ్డి (వేమన) బంగారం పరుసవేది విద్యద్వారా బంగారం తయారుచేసిన ఉదంతం ఉన్నది.

అయితే కొందరు పుణ్యభారత భువి పొరల్లో బంగారం తయారుచేయగల ఖనిజపు మట్టి ఉన్నదని చరిత్రకారులు ఋజువుచేశారు. ఇందుకు సంబంధించిన ఉదంతంగా కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ బంగారు గనుల్నుంచీ బంగారు ఉత్పత్తి చేస్తున్న విషయం జగదైక సత్యం.

## బంగారు ఉత్పత్తి, బంగారం వాడుకా, బంగారం లేకుంటే బ్రతుకేమున్నదనే భావన భారతీయులకే ఎక్కువగా ఉన్నది

అమ్మమ్మ మెడలో హారాలు అలంకరించింది... పెద్దమ్మ జడ సింగారం చేసింది... చిన్నమ్మ నడుముకి వడ్డాణం తగిలించింది. అత్తమ్మ వచ్చి గాజులు వేసింది... 'ఆగండాగండి...'' అంటూ అమ్మ హడావుడిగా వచ్చి అందాల అరవంకీని చేతికి తొడిగింది. పుత్తడిబొమ్మలా మెరిసిపోతున్న చిట్టితల్లిని కళ్లారా చూస్తే ఎక్కడ దిష్టి తగులుతుందో అనుకుంటూ కంటి కొలకుల్లో నిలిచిన కాటుక నీళ్లతో చటుక్కున దిష్టి చుక్క కూడా పెట్టేసింది.

తలలో చంద్రవంకలూ జడలో నాగరాలూ మెడలో హారాలూ చెవులకు లోలాకులూ, ముంజేతికి గాజులూ, నడుముకి వడ్డాణమూ మువ్వలగొలుసులూ, పాదాలకు పట్టీలూ... ఇలా పైనుంచి కిందవరకూ ఒంటినిండా ఎన్ని రకాల నగలు అలంకరించినా ఇంకా ఎక్కడో ఏదో లోటుగానే భావిస్తాం. అందుకే అంటుంటారు... అరవంకీ అందమే వేరనీ అది లేకపోతే పెళ్లికూతురు సింగారం పూర్తికాదంటారు.

ఒక్క పెళ్లి సింగారంలోనే కాదు, పట్టులంగాలు వేసుకునే పసిపిల్లల నుంచీ పరికిణీ పావడాలు కట్టుకునే పడుచుపిల్లలంతా అన్ని రకాల వేడుకల్లోనూ అరవంకీని ఎంతో ఇష్టంగా అలంకరించుకుంటారు. అందుకే పుట్టిన పసివాళ్లకీ రెండు చేతులకీ అరవంకీలు చేయించి మురిసిపోతుంటారు అమ్మమ్మలు.

### నగ ఒక్కటే...

బంగారం ధర విపరీతంగా పెరిగిపోవడంతో ఒకే నగని అనేక రకాలుగా వాడుకోగలిగేలా తయారుచేయాల్సి వస్తోందని హైదరాబాద్‌కి చెందిన ఆభరణాల డిజైనర్ అనిత ప్రశాంత్ చెబుతున్నారు. అందుకే ఓ పెద్ద సైజు రాళ్ల లాకెట్‌ను రూపొందించి దానికి రెండుగా విడదీయగల లావుపాటి చెయిన్‌ను చేస్తే హారంగా పనికివస్తుంది. విడదీసి ఓ చెయిన్‌ను మాత్రం లాకెట్ వెనకాల ఉన్న హుక్‌లోంచి తొడిగితే దాన్ని అరవంకీగానూ, వద్దనుకున్నప్పుడు చోకర్‌గానూ కూడా వాడుకోవచ్చు అంటున్నారు.



సాక్షాత్తూ మహాత్మాగాంధీ, జుగల్ కిషోర్ బిర్లా ఎదుట గోరక్ రసాయన శాలలో పండిత కృష్ణపాలశాస్త్రి 1943 సం॥ములో 200 తులాల బంగారం తయారు చేసినట్టు ఓ సత్యం ధృవపడింది. పురాణాల్లోగానీ, ఇతిహాసాల్లోగానీ భారతదేశంలో బంగారం పండించిన దాఖలాలు కోకొల్లలు. మన ఆంధ్రప్రదేశ్‌లోని హనుమకొండ, నాగార్జునసాగర్ తదితర ప్రాంతాల్లో త్రవ్వకాలు జరిపినపుడు మృణ్మయపాత్రల్లో బంగారం కనిపించినట్టు చెబుతున్న దాన్ని బట్టి మన పూర్వులు బంగారం నిలువచేసారంటే కట్టు కథలుగా తీసివేయరాదు.

ప్రపంచదేశాల్లో బంగారంపై వ్యామోహం కలిగించినది భారతదేశం ఒక్కటే. లంకెల బిందెలనీ, బంగారు బిందెలనీ మనవాళ్ళు కథలు కథలుగా చెప్పుకోవడమే గాకుండా, ఇతర దేశస్థులు మనదేశమ్మీద దండ యాత్రలు చేసినది ఈ బంగారం కోసమే. కోడి గుడ్డంత బంగారం లేని గృహమే లేదని చెప్పుకునే సామ్యంమన ఆంధ్రదేశం లోనే ఉంది. తిరుమల వేంకటేశ్వరస్వామి వారికి రాజులూ, చక్రవర్తులూ బంగారు కిరీటం, నగలు చేయించారనీ, అప్పటి ముస్లిము పాదుషాలు, నవాబులు దండయాత్ర చేయకుండా బంగారం ముడుపుగా యిస్తామని ఒప్పందం చేసుకుని యిచ్చిన విషయం చరిత్ర చెప్పిన సత్యమే! లక్షాధికారియైననూ లవణ అన్నములెగానీ మెండు బంగారం మ్రింగ లేడన్న విషయాన్ని శతక కర్త పద్యంలో విశదం చేసాడు. అలాటి బంగారాన్ని పూర్వం ప్రధానులు తాకట్టుపెట్టగా, పి.వి.నరసింహారావుగారు తాకట్టు విడిపించుకుని వచ్చారని ఇటీవల చరిత్ర యెరిగినవారికి సాక్ష్యాధారం. ఇలా చెప్పాలంటే అనేక సత్యాలు నిదర్శనంగా కనిపిస్తాయ్. పూర్వపు రాజులు బంగారు నాణెములనే ముద్రించేవారు. బ్రిటీష్‌వారు వచ్చాక కూడా వెండి రూపాయి నాణెములుండేవి.



యోగి వేమన

**హేమకారక విద్య యెరిగిన వారెల్ల వెతలుదయినట్టు విద్య చేత తత్త్వమెరుగు వెనుక తనకు చింతేలరా విశ్వదాభిరామ వినురవేమ–** యన్నది వేమన శతక పద్యపాదం. ఎవరి వద్ద ఎక్కువ బంగారం ఉంటే వారే ధనవంతులు. నీ బ్రతుకు బంగారం కావాలి– యని పెద్దలు ఆశీర్వదించేది బామ్మగారి బంగారు మాట. రామదాసు చెరను విడిపించుటకు రామలక్ష్మణులు బంగారు నాణెములనే యిచ్చారు. అలాటి బంగారంతో నిండిన ఆంధ్రదేశం, ఆర్థికంగా చిక్కుల నెదుర్కోవడం హాస్యాస్పదంగా ఉంది. అందుకు మనసు బాధపడ్తున్నది. చిహ్నామెత్తు బంగారం లేనివారు దేశంలో కోకొల్లలు. ఈ దరిద్రం ఎందుకు ఎలా వచ్చింది? ●

# ఎందుకయ్యా! వై.ఎస్. రాజశేఖరరెడ్డిని ఆడిపోస్తారు!

## అఖిల భారత కాంగ్రెసుకు ఆయనే జవసత్వాలిచ్చాడు!

### - తెలుగుదేశం కొట్టిన చావుదెబ్బకు దృశ్యాదృశ్యమైన కాంగ్రెసుకు జీవం పోసాడు! -

ఆంధ్ర కాంగ్రెస్‌లో నాయకుడంటూ ఉన్నాడా? నాయకులకు తక్క సామాన్య ప్రజలకు సోనియాగాంధీ తెలుసా? ఆంధ్రదేశమంతా పాదయాత్ర చేస్తూ ప్రజలను నవ్వుతూ పలకరిస్తూ, యోగక్షేమాలు అడుగుతూ, ఆంధ్రదేశంలో కాంగ్రెస్‌కు పునర్వైభవాన్ని తెచ్చిందెవరయా అంటే రాజశేఖరరెడ్డి. ఎక్కువ సంఖ్యలో పార్లమెంటుకు కాంగ్రెసు సభ్యులు ఎన్నికైనట్టు చేసి, కేంద్రంలోని కాంగ్రెస్‌కు బలాన్ని చేకూర్చాడు. సమర్ధ మైన పాలన అందించి, రెండవసారి కూడా కాంగ్రెస్ శాసన సభ్యులు పార్లమెంటు సభ్యుల స్థానాల్ను పెరిగేటట్టు చేసాడు. వ్యవసాయ క్షేత్రాన్ని సేద్యం చేసే రైతులకు ఉచిత విద్యుత్ కల్పించాడు. తానుండగా విద్యుత్ ఛార్జీలను పెంచనని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడు. తన హయాములోనే రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేస్తానన్నాడు వ్యవసాయ క్షేత్రాలున్న ఆంధ్ర ప్రదేశ్‌లో జనవనరులు పెంచడానికి పలు ప్రాజెక్టులు ప్రారంభించాడు. సోనియా గాంధీ నుంచి మొయిలీ, ఆజాద్, ప్రణబ్ ఆదిగా గల ప్రముఖులచే సెహబ్బాషయని పరపతిని పెంచుకున్నాడు.

ప్రతిపక్షాలెన్ని పరుషపు మాటలంటున్నప్పటికినీ చలించలేదు. ధైర్యంగా ముందుకు వెళ్ళాడు. పరిశ్రమలు పెరిగితే తక్క జనులకు ఉపాధి కలుగదని పారిశ్రామికులకెన్నో రాయితీలు, తక్కువ ధరలకూ భూములనిచ్చాడు. ఇదేపని గుజరాత్‌తో నరేంద్ర మోడీ చేసి 'తాతా' వారి నానో పరిశ్రమను తెచ్చుకున్నాడు.

రాష్ట్రంలో ఉన్న దినపత్రికలు ప్రతి పక్షాల కొమ్ము కాస్తున్నాయనీ, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల్లో ప్రజల్లోకి వెళ్ళడానికి ప్రభుత్వ మనుగడ కోసం ప్రజల్లో ప్రభుత్వ పథకాలు ప్రచారం కావడానికి 'సాక్షి' పత్రికను ప్రారంభించారు. జగన్ ఆ పత్రికలు బాధ్యతను ఔదలదాల్చి పెద్దపెట్టున రంగుల్లో రమణీయంగా, సంస్కృతీ పరంగా తెచ్చేసరికి, ప్రారంభ సర్క్యులేషన్ లక్షల్లోకి వచ్చింది. దాని నిర్వహణా భారం ఎక్కువ కావడంతో ప్రభుత్వ ప్రకటనలిచ్చేట్టు చేసాడు.

అనేకమంది పెద్ద పెద్ద పారిశ్రామికులు కృతజ్ఞతా భావంతో, సాక్షిలో లాభాలు వస్తాయని షేర్‌హోల్డర్స్‌గా చేరారు. కొంతమంది పారిశ్రామికవేత్తలైన రెడ్లు కూడా రెడ్ల అభిమానంతో షేర్లు తీసుకున్నారు. 'సాక్షి' దినదినాభివృద్ధి చెందడంతో ప్రతిపక్షాలు, ప్రతి పక్ష పత్రికలు, కాంగ్రెసులో పదవులు దక్కని వృద్ధనాయకులూ వై.ఎస్.పై కక్షను పెంచుకున్నారు. ఆ వృద్ధుల్లో ఒకరికి రాష్ట్రపతి అవ్వాలనీ, మరొకరు గవర్నరు కావాలనీ పెట్టుకున్న ఆశలు సఫలం కాలేదు.

వై.యస్.రాజశేఖరరెడ్డి వృద్ధ నాయకులను గమనించకుండా యువతరానికి పదవులిచ్చి ప్రోత్సహించడం కూడా కాంగ్రెస్‌లోని ఓ వర్గం వైరి వర్గమైంది. మరో ప్రక్క తెలంగాణా వాదులు, తెలుగుదేశం వంటి ప్రతిపక్షాల ప్రతి ఘటనలూ పెరిగాయ్. హైకమాండ్‌కు ఫిర్యాదులు వెళ్ళాయ్. వేటినీ **వైయస్** లెఖ్ఖ చేయలేదు. తాను చేయాలనుకున్న పనులు చేస్తూనే ఉన్నాడు. ప్రతిపక్షాల రోదనలను చెవిన పెట్టలేదు. కాంగ్రెసు హైకమాండ్ నాయకులు రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా వై.యస్ పాలనను పొగుడుతూండడం కూడా వైరి వర్గాలకు వైషమ్యభావం పెంచుతూనే ఉంది. రెండవసారి కూడా వై.యస్సే ముఖ్యమంత్రి కావడాన్ని వారు సహించలేక పోయారు. వై.యస్. పాతవారిని కాదని, క్రొత్తవారికి మంత్రి పదవులిచ్చారు. కిరణ్‌కుమార్ రెడ్డిని శాసన సభాధ్యక్షునిగా చేసి సోనియాగాంధి (కాంగ్రెస్ హైకమాండ్) దృష్టికి తెచ్చినదీ ఆయనే! వై.యస్.కాంగ్రెస్‌కు చేసిన కృషీ, వ్యవసాయదారుల క్షేమానికి, వృత్తి కులాలవారికి వై.యస్.చేసిన అకుంఠిత, అవిరామకృషీ, ఆరోగ్య సంరక్షణ పథకాలు కిరణ్‌కుమార్‌రెడ్డి ఎరుగరా? చంద్రబాబు, చిరంజీవులు ఎరుగరా? ఇడుపలపాయలో వై.యస్.పార్ధివ శరీరాన్ని చూడడానికి వెళ్లి, ఆ జన సందోహంలో లోపలికి వెళ్ళలేక తిరిగిరావడమూ రాష్ట్రంలో వై.యస్.కు ఇంత పాప్యులారిటీ ఉందని వారు ఆశ్చర్యపడడం వారికీ, ప్రజలకూ గుర్తులేదా? కాంగ్రెస్ పెద్దలే గాకుండా, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ముఖ్యాధికారులు వై.యస్.పాలనను ప్రశంసించడం ఎలా మరచిపోయారు.

ఆనాడు అందరికి మంచి వాడై, ఈనాడు ఆయన్ను దోపిడీ దారూ దొంగా అని అంటే ప్రజలు సహిస్తారా? ప్రజలూ తెలివి మీరారు.

తెలుగు నాయకుల్లో ఉన్న అసూయను గ్రహించారు. వై,ఎస్. మరణానన్తరం జగన్ కూడా విశ్వాసంగానే ఉన్నాడు. కాంగ్రెస్ హైకమాండ్ వై.యస్. కుటుంబంలో స్పర్థలు తేవడం చూచి నివ్వెరపోయాడు. సోనీయాగాంధీ ఎత్తుగడలు, వైయస్ కుటుంబం పట్ల అవిశ్వాసంగా ఉండడం, సాక్షి, సాక్షి టి.విలపై నేరపరిశోధనా శాఖను తరమడం ఇది వై.యస్. ప్రతిభ కానే కాదు– 'సోనియా' బొమ్మ పెట్టుకుని గెలిచాడని వృద్ధ జంబూకాలనడం, వేలకోట్లు దోచాడని పత్రికక్షులు అనడం చివరకు సాక్షి, సాక్షి టి.వి. బాంకు ఎక్కౌంట్లను నిలిపి జగన్ అరెస్ట్ వరకూ వెళ్ళడం సామాన్య ప్రజలకు అనుమానం తోచింది. వై.యస్. ఉన్నపుడు నోరు అదుపులో పెట్టుకున్నవారు – వై.యస్.బ్రతికుంటే జైలు పాలయ్యేవాడనడం, వై.ఎస్.ఆర్. పార్టీ ఉప ఎన్నికల ప్రచారం చేస్తున్నప్పుడు వారినేదో దొంగలవలె తాలిబాన్లవలె నడిరోడ్డు మీద నిలబెట్టి బట్టల సూట్‌కేసులు నడిరోడ్డుపై తెరచి విజయమ్మను ఇబ్బంది పెట్టడం, వారి సభలకు కరెంటు లేకుండా చేయడాన్ని ప్రజలు గుర్తించారు.

కిరణ్‌కుమార్ రెడ్డి మంత్రి వర్గంపై అవిశ్వాస తీర్మానాన్ని జగన్ గర్హించిన మంచితన్నాన్ని కూడా గుర్తించలేదు.

కాంగ్రెస్‌లో ఓడదాటే వరకూ ఓడమల్లయ్య తరువాత బోడీ మల్లయ్య అనడం వారికే చెల్లింది.

నెహ్రూ కుటుంబానికెంతో సేవలు చేసి బలం లేని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రధానిగా 5 ఏళ్ళు కాంగ్రెసు ప్రభుత్వాన్ని నడిపిన పి.వి. నరసింహారావును (తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించాడు) చివరిరోజుల్లో కాంగ్రెస్ ఎంతగా ఇబ్బందులు పెట్టిందో తెలుగు ప్రజలు మననం చేసుకుంటున్నారు. ఢిల్లీలో పి.వి.కి ఒక స్మారక చిహ్నం లేకుండా చేసారు. ●



**కాంగ్రెసు హైకమాండ్ మొదట్నుంచీ తెలుగువారిని చులకనగా చూచింది. ప్రకాశం గారి నుంచి వై.ఎస్.వరకూ ఎందరో కార్యకర్తల్ని వాడుకుని వదిలేసింది.**

# చెన్నైలో తెలుగు చదువుకొంటున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే కంకణం కట్టుకున్న కె. నరసారెడ్డి



ఆర్యవైశ్యులకు దీటుగా ఆర్షధర్మ ఆచరణ పరులుగా, మాతృభాషను పోషించాలని కంకణం కట్టుకున్న వారు 'రెడ్లు' అని చెప్పడానికి గర్వపడుతున్నాను. వారికి ధర్మగుణం ఎక్కువ, దైవభక్తి ఎక్కువ, దేశభక్తి ఎక్కువ, మాతృభాష మీద మమకారమెక్కువ.

కెన్సిస్ కనస్ట్రక్షన్స్ అధినేత కె.నరసారెడ్డిని చెన్నయ్ వచ్చినప్పట్నుంచి చూస్తున్నాను. ఆజానుబాహుడు, అరవిందదళాయతాక్షుడు ఆయన ఆపాదమస్తకం మంచి భావంతో ధవళకాంతులీనుతూంటుంది. తెలుగు తల్లి తెలుపుదనం, తెలుగువెలుగుల తెలుగుదనం, తెలుగు భాషపై గల ఆత్మీయదనం, తెలుగుసార స్వత సరస్వతీ పుత్రులపై సహృదయాత్మక గౌరవం చంద్ర కిరణాల్లా శీతలంగా ఆయనలో ప్రవహిస్తూనే ఉంటాయ్. ఆయన్ను గురించి విశేషాలు ప్రముఖాంధ్ర పాఠకులకు విదితమే!

ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ పూర్వాధ్యక్షులుగా చాలామంది తెలుగు వాళ్ళ మదిలో మెదులుతూనే ఉన్నారు. మంచి కార్యాలకు ముందుంటారు.

తెలుగు కళా సాంస్కృతిక సాహిత్యాలకు తల్లి స్థానమైన చెన్నయ్‌లో తెలుగు నామమాత్రంగా కూడా కనిపించడంలేదు. తెలుగు భాషను అభ్యసించే విద్యార్థులు కనిపించడం లేదనీ ఎంతో బాధను ఎన్నో చోట్ల వ్యక్తం చేసారు. ఉట్టి కబుర్లుగానే గాకుండా తెలుగు చదువుకొనే విద్యార్థులకు తాము ప్రోత్సాహమిస్తానని మంచి మనసుతో ముందుకు వచ్చిన ఘనుడు అనడంతో బాటు ఆయన ప్రోత్సాహ కార్యక్రమం ప్రారంభమైందని చెప్పాలి.

**అన్నదానం మహాదానం విద్యాదానం మహత్తరమ్**
**అన్నేన క్షణికా తృప్తిః యావజ్జీవంతు విద్యయా!**

అన్నారు పూర్వులు

అన్నదానం మహాదానమే, విద్యాదానం అన్నదానం కంటే గొప్పది. అన్నం క్షణిక తృప్తినే కలిగిస్తుంది. విద్యవల్ల కలిగే తృప్తి యావజ్జీవితమూ ఉంటుంది. విద్యను నేర్పితే విద్యసాయంతో అన్నాదులు సంపాదించుకోగలడు. అందునా మాతృ భాషాధ్యయానానికి సహాయం చేసిననాడు తరువాతి తరాల వారికి తరతరాలుగా తరగని తెలుగు భాషా సంపదనిచ్చిన వాడవుతాడు. జన్మనిచ్చిన తెలుగుతల్లి ఋణం తీర్చుకోకలిగినవాడవుతాడు.

**జ్ఞానము కేవల కృపన**
**జ్ఞానికి నుపదేశవిధిఁబ్రకాశము సేయం**
**గానది సకలధరిత్రీ**
**దానంబున కంటె నధికతకఫలదయగున్!**

– స్వార్థ చింతననునది లేకుండా, ఔదార్యముతో, ప్రేమతో, దయతో, ఉపకారబుద్ధితో జ్ఞానమనే దీపం ప్రజ్వలింపచేయడానికి ఎవరు ప్రోత్సాహమిస్తాడో,

**రాజకీయంగా ఎవరు ఏమనుకున్నాగానీ, ఆరేడు సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన ముఖ్య మంత్రి కీ॥శే వై.యస్.రాజశేఖరరెడ్డికి తెలుగు భాష మీద, తెలుగుదనం కట్టుబొట్టు మీద మమకారము నెక్కువగా చూపేవారు. మద్రాసులోని తెలుగువారిని ఆంధ్ర ముఖ్య మంత్రులెవరూ పట్టించుకొనే వారు కాదు. ప్రొ.సి.ఎం.కె.రెడ్డి వంటి తెలుగు అభి మానుల కోరికపై అఖిల భారత తెలుగు మహా సభలను జరిపినప్పుడు వై.ఎస్. వచ్చి దిగ్విజయంగా జరిపించారు. ఆయన పాలనా కాలంలోనే తెలుగు భాషను క్లాసికల్ భాషగా కేంద్రం గుర్తించింది. ఆయన ప్రోత్సాహంతోనే కొన్ని కోట్ల రూపాయలతో విశాఖపట్టణంలో ప్రపంచ తెలుగు సమాఖ్య తెలుగు మ్యూజియమ్ కట్టుకోగలుగుతుంది. ఆయన బ్రతికుంటే ఈసరికి చెన్నయ్‌లో ఆంధ్రప్రభుత్వంచే ఆంధ్రభవనం కట్టబడి ఉండేది. అలాటి ప్రజల ముఖ్యమంత్రిని పోగొట్టుకున్న తెలుగువారు దురదృష్టవంతులు. అందుకే మనిషి మంచివాడు కాడు. ఆయన చేసిన మంచి పనులు గుర్తుంచుకోడు!**

అలాటి దాతకు విశ్వమంతటా దానం చేసిన అనంత ఫలం పుణ్యం లభిస్తుంది. భూమండలమంతా అతన్ని పుణ్య (పుడమి) దేవత పుణ్యమనుగ్రహిస్తుంది.

## పేద తెలుగు విద్యార్థులకు పెద్ద పెద్ద చదువులు చదివించడమే తన ధ్యేయం

ముఖ్యంగా పేద తెలుగు విద్యార్థుల పెద్ద పెద్ద చదువుల కోసమే కెన్సిస్ ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్టును నరసారెడ్డి స్థాపించారు. వైద్య, విద్య, సాంకేతిక విద్యలు (తెలుగుతో బాటు) నేర్చుకొనే వారికి ఆర్థిక సహాయం చేయడంలో ఆత్మతృప్తి లభిస్తుంది. ప్లస్‌టూ తరువాత ఉన్నత విద్య చదువుకునే వారికి తన ట్రస్టు పూర్తి సహాయం చేస్తుందన్నారు. తెలుగులో 96 మార్కులు సంపాదించిన విద్యార్థీ విద్యార్థినులకు రు. 10,000లు, రు.7,500లు, రు. 5,000లు ప్రథమ, ద్వితీయ, తృతీయులుగా గణనం చేసి రొఖ్ఖ రూపకంగా బహుమానం అందచేసారు.

చెన్నయ్‌లోని తెలుగువారందరూ సంఘటితమై సమావేశాలు జరుపుకునే మంచి రోజు రావాలన్నారు. వచ్చే ఉగాది నాటికి అన్ని సంఘాలూ ఒకటియై, పెద్ద ఎత్తున, ఒకే వేదికపై సమావేశం కావాలని అభిలషిస్తున్నట్టు చెప్పారు. సంపాదనలో కొంత యితరులకు సహాయం చేస్తూండడమంత ఆత్మ సంతృప్తి మరొకటి లేదు. ఈ సమావేశంలో అతి మంచితనానికి మార్గగాములైన ప్రసిద్ధ ఆడిటర్ జె.కె. రెడ్డి, ఆస్కా పూర్వాధ్యక్షుడు ఆదిశేషయ్య ఆస్కా కార్యదర్శి కె.సాంబశివరావు, పూర్వకార్యదర్శి చక్రవర్తి, సహకార్యదర్శి కృష్ణ–ఎందరో ఇతర పెద్దలు పాల్గొన్నారు.

**యద్యదాచరతి శ్రేష్టః తత్తదేవేతరో జనః**
**స యత్ప్రమాణం కురుతేలోకస్త దనువర్తతే**

–గీతాచార్యుడు అన్నట్టు శ్రేష్ఠుడైన వ్యక్తి ఏ మంచి పనిచేస్తాడో, ఇతర జనులు కూడా ఆ పనినే చేస్తారు. మంచివాడు దేనిని ప్రమాణంగా తీసుకుంటాడో, అందరూ దానినే ప్రమాణంగా తీసుకుంటారు. ధర్మం, దానం, సత్యం, త్యాగములు ఆంధ్రులకు సుపరిచితమైన పదాలు. 'ధరి'ని ధరించేది ధర్మం. ఆంధ్రదేశంలో ధర్మంలోపించి, అధర్మం రాజ్యమేలడాన్ని ధర్మపరులు గర్హించాలి.

చెన్నయ్‌లో కె.వి. సుబ్బారెడ్డి, కె.నరసారెడ్డి, జె.కె.రెడ్డి, సి.ఎం.కె.రెడ్డి, ప్రతాప సి.రెడ్డి, డా॥ మోహన్‌రెడ్డి వంటి సిరిమంతులున్నారు. వీరందరూ తెలుగువారి కోసం, తెలుగు అభివృద్ధి కోసం కృషి చేసిన నాడు చెన్నయ్‌లోని తెలుగువారు అభ్యున్నతితో పాటు ఆనందానుభూతులను పొందగలరు. పేదలు పేదలు గాకుండా చెప్పుకోలేని పేదవారు మధ్యతరగతి వారున్నారు. వీరిని ప్రభుత్వం పట్టించుకోదు. ఇలాటి వారిని ఆదుకునే ఆదరగుణం ఆదర్శంగా ఆచరించి చూపిస్తున్న రెడ్డిగారూ! భళా! నరసారెడ్డి! నీవే మొనగాడివయ్యా! ●

Beautiful City - Beautiful Hotel


Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# ప్రేక్షకుల్ని తన పద్యాలతో పరవశింపచేసిన బండారు రామారావు

పద్య నాటక ప్రవీణులెవరయ్యా- అంటే తెలుగు వారేనయ్యా- అని చెప్పుకోవాలి. పద్యమే తెలుగు వారి సొత్తు. పద్యాన్ని సొగసుగా వ్రాయ కలిగిన కవులు తెలుగువారెలాగో, వాటిని శ్రావ్యంగా పాడ కలిగేవారూ తెలుగు నటులే! నాటకాల్లో గానీ, అలనాటి సినిమాల్లోగానీ అత్యంత మనోహరంగా గానం చేయగల నటీనటులుండేవారు. వారంతా నాటకాల్లో నిష్ణాతులై, వెండితెర కొలువుకు ఎదిగినవారే! మరికొందరు కలకత్తాయో, కొల్హాపూరో, కాలక్రమేణా మద్రాసుకో వెళ్ళి, నాటకాల గిరాకీని పోగొట్టుకోకుండా రంగస్థలం మీదనే శ్రావ్య విహారం చేశారు. వారు వేదిక మీదకు వస్తే, ఈలలు ఏంవిటి, చప్పట్లు ఏంవిటి, పులకింతలు ఏంవిటి- మహాపర్వదినంగా భావించి, పరవశించేవారు.

అటువంటి వారిలో గళ ప్రావీణ్యం మొలకపోసిన సమ్మోహన స్వరనటుడు బండారు రామారావు. 1957 సం॥ము నుంచీ 1972 సం॥ము వరకూ ఊరూరా వేదికల్ని చేసుకుని పౌరాణిక నాటకాల్ని ప్రదర్శించిన నటనాధురీణుడు, గాన గంధర్వుడూ! ఆయన ఏ నాటకాన్ని ప్రదర్శించినా ఆ నాటక పద్య సారస్వాన్ని అనుభవించి ఆలపించేవాడు. చివరిగా హరిశ్చంద్ర నాటకంలోని కొన్ని పద్యాలను ఆలపించమనేవారు. ఆయన పద్యానికీ, పద్య నాటకానికీ అంత ప్రావీణ్యం, రసభరితమైన పస ఉండేది. ఆయన ప్రేక్షకుల అభ్యర్ధనను మన్నించేవాడు.



హిందోళ రాగంలో బాంధవ్యం పద్యాన్ని పాడుతుంటే వింటూ- మూడవ పాదం చివర్నే 'ఒన్సుమోర్' అనే రసజ్ఞ ప్రేక్షకులెందరో! అసలు పద్యం-

**అన్నలు తమ్ములున్ ఆప్తులు బంధుగు లెవ్వరైన, నీ సన్నిధి జేరలేరు, భవసాగరమును తరింపనీరు లోకోన్నత స్వరూపా-** అన్నది పద్యం అఖిల ప్రజా ప్రచార మందినదే గానీ- ఏ నాటకంలోనిదో చెప్పలేనిది. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి 'సత్య హరిశ్చంద్ర'లో గానీ, జాషువాగారి 'హరిశ్చంద్ర'లో కనుపించనిది.

రామారావుగారి సన్నిహిత మిత్రులైన రామానుజసూరి చేత బండారు రామారావు, వ్రాయించుకుని సందర్భోచితంగా 'సత్యహరిశ్చంద్ర'లో పాడేవారు. రామారావు అత్యంత సన్నిహితులైన మిత్రులు. ఒకరినొకరు 'మామా' యని సంబోధించుకునేవారట. సూరిగారు సంగీత సహకారం కూడా తన హార్మోనియం మీద అందించేవారట. 1957 సం॥ము కార్తీక పౌర్ణమినాడు ఇనిమెట్ల గ్రామంలో హరిశ్చంద్రుని పాత్ర ద్వారా పాడుతూ నటిస్తూంటే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హరిశ్చంద్ర చంద్రమతులు విడిపోయే సందర్భ సన్నివేశంలో పాడిన పద్యం ప్రేక్షకుల్ని ఎంతగానో స్పందింపజేసింది.

ఎదురుగా సూరిగారి వ్రేళ్లు హార్మోనియం మెట్లపై నడుస్తూంటే- ఆయన సూరిగార్ని కళ్ళతోనే చూస్తూ, తన్మయత్వంతో, పాత్రలో తాదాత్మ్యం చెంది పాడారు. సూరిగారితో పాటు గ్రామస్తులంతా సమ్మోహితులయ్యారు. రామారావు అప్పటి కప్పుడు కూర్చుకున్న హిందోళ రాగానికి అనువుగా సూరి హార్మోనియం వాయించి ఇద్దరూ సంగీత సాహిత్యాల్లో లీనమయ్యారు.

అద్దంకి సీమనందు పుట్టిన రామారావు చదువు సంధ్యలు బాగానే సాగాయ్, పద్యంపై గల వ్యామోహంతో రంగస్థల నటులయ్యారు. రామారావు గురించి పసుపులేటి వెంకటస్వామి నాయుడు ప్రశంసా వాక్యాలను నుడువుతూ- 'తెలుగు పద్యానికున్న చందోబద్ధతు లెరింగి, లయబద్ధంగా, రాగరంజకంగా చదువుతూ అభినయాన్ని జోడించి రసహృదయాలను డోలలాడిస్తూ, ప్రేక్షకుల్ని ఆనందడోలికల్లో నూగించే శక్తివంత నటుడు బండారు రామారావు అన్నారు.

ఈ మాటలు లేశమాత్రమైననూ అతిశయోక్తి కానేరవు. ఆయన జనాదరణ గల అన్ని పౌరాణిక నాటకాల్లో నటించి నప్పటికినీ 'హరిశ్చంద్ర' పాత్ర ఆయనకు తలమానికమైంది. సుప్రసిద్ధ రంగస్థల నటుడు, బందరు వాసీ డి,వి. సుబ్బారావు కూడా ఈ బాణీనే అనుసరించాడు.

బండారు రామారావుగారు ఆంధ్రదేశంలో ఎన్నెన్నో సన్మానా లందుకున్నారు. ఘంటాకంకణ సత్కారములును పొందారు.

విశేష మేమన నవయుగ కవి చక్రవర్తిగా ఖ్యాతి నొందిన జాషువాగారు ఆయన స్వహస్తాలతో బండారు రామారావుకు కంకణం తొడిగారు. నట చూడామణి బిరుదమందజేశారు. స్థానం నరసింహారావుగారు అబ్బురపడి 'నటశేఖర' బిరుద ప్రదానమొసగారు.

పద్యాన్ని శ్రావ్యంగా సందర్భ శుద్ధిగా, చందోబద్ధంగా, రాగతాళ యుక్తంగా రమ్యమైన స్వరంతో పాడుతూ, హావభావాలు ప్రదర్శించి, అశేష జనుల్ని సమ్మోహితుల్ని కావించిన బండారు రామారావు తన 49వ ఏట నవంబరు 5వ తేదీన అల్పాయుష్కునిగా మరణించడం ఆంధ్ర నాటక రంగానికే తీరని ఘోర నష్టమైంది. ఇప్పటికీ ఆయన అభిమానులు నవంబర్ 5న రామారావు సంస్మరణ సభల్ని జరిపిస్తూనే ఉంటారు. ●


*If you want Comfortable Stay-*
*Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"

# తెలంగాణా కేసరిగా, దక్కను గాంధీగా పల్లె పల్లెనా ఖ్యాతిగాంచిన పల్లెర హనుమంతరావు!



దేశభక్తిని దీప్తిచెందిస్తూ, దేశం కోసం, దేశ ప్రజల కోసమూ అహరహమూ కృషి చేసి, తన, మాన, ధనాలను దేశాని కర్పించిన మహాత్ములు వారు. వారు ఆంధ్రులా, రాయలసీమ వారా, తెలంగాణా వారా యనే ప్రశ్న తలెత్తదు. తెలుగుదేశంలో పుట్టినందున తెలుగు తల్లి ఋణం తీర్చుకుంటూ, దేశానికీ, దేశప్రజలకు ఋణం పడ్డామనే త్యాగశీలురను కన్న దేశమిది. త్యాగగుణానికీ, గుణశీలానికీ గుర్తుగా నిలిచిపోయినవారిలో పల్లెర హనుమంతరావు గారు ప్రథములు. తెలంగాణాలోని మహబూబ్‌నగర్ జిల్లా ఎందరో దేశభక్తిగల నాయకులకు నెలవైంది. చాలామందికి స్వంత బలం కన్నా స్థానబలం ఎక్కువగా ఉండేది. కానీ పల్లెర హనుమంతరావుగారికి స్వంత బలమూ స్థానం బలమూ రెండూ ఉండేవి. మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరులోని ఓ మధ్యతరగతి కుటుంబంలో 1908 సం॥ము మే నెల 27న హనుమంతరావుగారు మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులైన పిదప 'లా' చదివి పాలమూరులోనే న్యాయవాది వృత్తిలో ప్రసిద్ధి చెందారు. న్యాయవాది వృత్తి చేస్తున్నప్పటికినీ ఆయన పల్లెలూ, గ్రామాల అభివృద్ధి సమస్యలపైననూ, మంచినీటి బావుల త్రవ్వకం, పాఠశాలల ప్రారంభం, ఖాదీ పరిశ్రమల స్థాపనం, చరఖా కేంద్రముల ఏర్పాటు – ప్రజల జీవనాధారిక కార్యక్రమములన్నిటినీ, స్వార్ధచింతనం లేకుండా అంకితభావంతో నెరవేర్చిన మహానాయకుడు.

మహాత్మాగాంధీ గారి ప్రభావం మన మహదాంధ్ర ప్రముఖులపై బాగా పడింది. గాంధీగారి సహాయ నిరాకరణోద్యమం, హరిజనోద్ధరణ, పీడిత వర్గాలకు సేవ, విదేశీ వస్త్ర బహిష్కరణం, ఖాదీధారణం, హిందీ ప్రచారం, హరిజనుల దేవాలయ ప్రవేశం, ఉప్పు సత్యాగ్రహం వంటి జాతీయ కార్యక్రమాలకు మహదాంధ్ర నాయకులే ఎక్కువగా స్పందించేవారు, జనంలోకి చొచ్చుకువెళ్ళి, కార్యక్రమాలకే కార్యవిఘ్నాల్లేకుండా జరగడానికీ, ఉద్యోగాలూ, ప్రభుత్వోపాదులనూ విడచి, స్వార్జితాలను సహితమూ ప్రజలకే అర్పించిన తెలంగాణా కేసరి పల్లెర హనుమంతరావు.

తెలంగాణా ప్రసాదించిన మరో గొప్ప నాయకుడు బూర్గుల రామకృష్ణారావు. ఆయనకు మాతృదేశభక్తితో బాటు మాతృభాషా భక్తి అధికం. బూర్గులవారి ప్రభావం పల్లెర హనుమంతరావుగారిపై పూర్తిగా ప్రసరించడంతో ఆయన నిజాము రాష్ట్ర కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1942 సం॥ నుంచీ జాతీయవాది. జిల్లా కాంగ్రెసు అధ్యక్షుల్నుంచీ, స్టేటు కాంగ్రెసు ఉపాధ్యక్షులయ్యారు. రెండు పర్యాయ ములు జైలు శిక్ష ననుభవించారు. కందిలో జరిగిన 13వ ఆంధ్ర మహాసభల్లో పాల్గొన్న ఉత్సుకతతో, 14వ ఆంధ్ర మహాసభను జడ్చర్లలో జరిపించారు. ఆ మహాసభల ఆహ్వాన సంఘాధ్యక్షులు హనుమంతరావుగారే. 1946 సం॥ములో నిజాం ప్రభుత్వం కాంగ్రెసు పార్టీ మీద కల నిషేధాజ్ఞలను తొలగించడంతో, జడ్జెర్లలోని మహాసభ రాష్ట్ర కాంగ్రెస్ మహాసభగా రూపులుదిద్దుకున్నది. ఆ సభలకు సర్దార్ జమలాపురం కేశవరావుగారు అధ్యక్షులు. కాంగ్రెస్‌పై నిషేధం తొలగడంతో ఆయన నిజామంతటా పర్యటించారు. ఎందరెందరో కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దిన ఖ్యాతి హనుమంతరావుగారిదే అని చెప్పాలి. 1952వ సం॥ములో సార్వత్రిక ఎన్నికలొచ్చాయ్. మహబూబ్‌నగర స్థానం నుంచీ – రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. బూర్గుల రామకృష్ణారావుగారు ముఖ్యమంత్రి అయ్యారు. వారి మంత్రి వర్గంలో హనుమంతరావుగారు ఉపముఖ్యమంత్రి అయ్యారు. మంత్రి పదవి అలంకారప్రాయం కాదని ఆయనకు తెలుసు. నిత్యమూ అధికారులతో సమావేశమై ప్రజల సమస్యలను తెలుసుకుని అప్పటికప్పుడు పరిష్కరించేవారు. ఆయనకు రెవెన్యూ, ఎక్సైజ్, ఫారెస్ట్, దేవాదాయ శాఖలను బూర్గులవారు కేటాయించారు. భారతదేశం మొత్తమ్మీద సంస్కరణలను చేబట్టిన మంత్రివర్యులు పల్లెరవారే. భూగరిష్ఠ పరిమితి చట్టాన్ని అమలుపరిచిన తీరు ప్రధానంగా హనుమంతరావుగారికే దక్కుతుంది. మాట నిలుపుకొనే మనిషి, ముందుకేసిన అడుగును వెనకకు వేయని వ్యక్తి. పోలీసు చర్యల్లో భీతాహులైన ముస్లిములకు తన యింట్లో రక్షణ యిచ్చారు. కొందరు దుండగులు వారిని విడిచిపెట్ట మని గర్జిస్తే, 'కుదరదు' అని ధీమాగా చెప్పిన మనిషి. హిందూ ముస్లిము సమైక్యతను కాపాడే బాటను వేసిన మహామనిషి. ఆరోజుల్లో ప్రత్యర్థులిరువురూ ఒకే వేదికపై కలిసి మాట్లాడే సంస్కారం ఉండేది, సభ్యపద జాలం ఉండేది. ఆ సంస్కృతిని అక్షరాల పాటిస్తూ, ఒకచోట కూర్చుని భోజనం చేసే సాంప్ర దాయాన్ని బలం చేసారు.

ఆయన సింహంలాటి వాడు. అందుకే ప్రజలు దక్కను కేసరి, గాంధీజీ ఆశ్రయాల్ను, సిద్ధాంతాలను తూ.చ. తప్ప కుండా పాటించేవాడు కాబట్టి 'దక్కన్ గాంధీ'యని ప్రజలు పిలిచేవారు. 1955లో జయ ప్రకాశ్ నారాయణ సర్వోదయ యాత్రను పల్లెరవారి నియోజిక వర్గం నుంచే ప్రారంభించారు. వినోబాభావే భూదాన యజ్ఞ ఉద్యమం చేబట్టినప్పుడు, పల్లెర వారు తమ పాలమూరు వచ్చి యాత్రను కొనసాగించమని కోరినప్పుడు 50 వేల ఎకరాల భూమిని దానంగా యిప్పించ దలిస్తే వస్తానన్నారు. హనుమంతరావుగారందుకు అంగీకరించారు. 1956 సం॥ము మార్చి 16నాడు అలంపురంలో నెలరోజుల యాత్ర ముగిసినప్పుడు వినోబా భావేకిచ్చిన మాట ప్రకారం 50 వేల ఎకరాల భూదానం కార్య క్రమాన్ని సత్యం కావించారు. మీకు ముందే ఈ వ్యాసంలో నివేదించినట్టు 1957 సం॥ములో హనుమంతరావు గారు పార్లమెంటు ఎన్నికలకు పోటీ చేసారు. ఆయన ప్రత్యర్థిగా ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకుడు ముఖ్దాం మొహియుద్దీన్ పెద్ద పోటీ యిచ్చారు. ఇరువురూ ఒకే వేదికపై ఉపన్యసించారు. కలిసి భోజనం చేసారు. అలాటి గుణశీలత వారిది. హనుమంతరావుగారు పార్లమెంటుకు పోటీ చేసి పదేళ్లు లోక్‌సభ సభ్యులుగా ప్రజలకు సేవలు అందించారు. రాజకీయాల్నుంచీ స్వచ్ఛందంగా విరమించి, నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1979 సెప్టెంబర్ 19న మరణించే వరకూ ప్రజాసేవ చేస్తూనే గడిపిన మహానాయకుడాయన. ●

*రామాయణంలో హనుమంతుడే లేకపోతే అంకిత సేవా భావము లెలా ఉంటాయో జనులకు ఎరికయ్యేడిది కాదు, సందర్భోచితంగా ఎలా మాట్లాడాలో అన్నది కూడా జనులకెరికయ్యేడిది కాదు. తలపెట్టిన కార్యమును సాహసముతో కొనసాగించకుండా విఘ్నవిఘాతముల కెరగాకుండా సత్యమనస్సు, సం'పూర్ణాం' కిత భావములు ప్రజలకు బోధింపబడేది కాదు. వాల్మీకి 'రామాయణం'లోని వాగ్భూషణలన్నిటినీ ఆచరణలో పెట్టిన గుణశీలుడు, పల్లెర హనుమంతరావు. (ఈనాటి ప్రజానాయకులకు బోధయై కొంతైనా పాటించగలరనే వీరిచరిత ఉదహరించాను.) - గోటేటి*

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
Ring Road, Tirumala. Ph : 517504
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



80

## పదకొండవ అధ్యాయము - విశ్వరూప సందర్శన యోగము

అనన్య భక్తి వలననే మనుజుడు పరమాత్మను సందర్శింప గల్గునని యిట వచింపబడినది. భక్తి అను పదమునకు 'అనన్య' అను విశేషణము చేర్చుట వలన, ఇతరములగు ప్రాపంచిక పదార్థములపై ఆసక్తినుంచక కేవలము పరమాత్మయందే అనన్యమగు ప్రేమ, అనురాగము, ఆసక్తి కలిగియుండవలయునని స్పష్టమగుచున్నది. పంపకము లేని భక్తి, మఱియొక వస్తువుపై చెదిరిపోని భక్తి, పరమాత్మ తప్ప అన్య వస్తువును అభిలషింపని భక్తి అనన్యభక్తి యనబడును. సామాన్యముగ జనులయొక్క భక్తి కొంత గృహారామాదులందు, ధారాపుత్రులందు, సంపదలయందు, కీర్తిప్రతిష్ఠల యందు విభజింపబడినది యగుటవలన, భగవంతునిపై ఏకొద్దియో భక్తి మిగులుచున్నది. ఇది అనన్యభక్తి కాదు. దృశ్య పదార్థములందు పంపకము లేని భక్తియే అనన్యభక్తి అదియే భగవత్సందర్శనమునకు ఏకైక ఉపాయమని యిట తెలుపబడినది.

అట్టి అనన్యభక్తిచే భగవానుని (1) తెలిసికొనుటకు (జ్ఞాతుం), (2) చూచుటకు (ద్రష్టుం), (3) ప్రవేశించుటకు (ప్రవేష్టుం) శక్యమగునని పేర్కొనబడినది. దాని భావమేమి? ఇచట తెలిసికొనుట, చూచుట, ప్రవేశించు అను మూడు క్రియలు చెప్పబడినవి. ప్రారంభమున మనుజునకు 'భగవంతుడిట్టివాడు' అను పరిజ్ఞానము కలుగును. 'జ్ఞాతుమ్' ఇది మొదటి అంతస్తు. ఈ స్థితియందు భక్తునకు భగవంతుడొకింత దూరముగనే యుండును. ఇది ద్వైతస్థితి. తదుపరి అభ్యాసవశమున ఆ భక్తుడు భగవంతునకు ఇంకను సమీపమునకు వచ్చి ప్రత్యక్షముగా అతనిని దర్శింపగల్గును. (ద్రష్టుమ్). ఇక భగవద్విషయమై అతనికే మాత్రము సందేహముండజాలదు. ఇది రెండవ అంతస్తు. ఇది మొదటిదానికంటె పైస్థితి ఈ స్థితియందు భక్తుడు భగవంతునకు అతిసమీపమున వచ్చిచేరును. అత్తఱి, కరతలమందలి బిల్వఫలములనుగాని, అమలకఫలమునుగాని మనుజుడు ప్రత్యక్షముగ చూడగల్గునట్లు, యాతడు భగవంతుని విస్పష్టముగా గాంచగల్గును. ఇది దాదాపు విశిష్టాద్వైతస్థితికి సమానము.

అటుపిమ్మట అభ్యాసప్రాబల్యమునే ఆ భక్తుడు భగవంతునకింకను సమీపమునకు వెళ్ళి క్రమముగ వారియందు ప్రవేశించి ఐక్యమైపోవును. (ప్రవేష్టుమ్). ఉప్పు కల్లు సముద్రమునందు లయించినట్లు, వర్షబిందువు నదీజలమున మిళితమై పోవునట్లు, నీళ్లు పాలలో కలిసిపోయినట్లు, అత్తఱి భక్తుడు భగవంతునియందు విలీనమై పోవును. అప్పుడు భక్తుడు, భగవంతుడు - అను రెండు వస్తువులుండనేరవు. ఒకే భగవద్వస్తువు మిగిలియుండును. ఇది మొదటి రెండంతస్తులకంటెను పరమైనది. ఇది పూర్ణ అద్వైతస్థితి. ప్రతివాడు మొదటి రెండంతస్తుల యనుభవమును బొంది, అంతటితో తృప్తినొందక సాధనాభ్యాసమును ఇతోధికముగ కొనసాగించుచు యనుభవమును బొంది, అంతటితో తృప్తినొందక సాధనాభ్యాసమును ఇతోధికముగ కొనసాగించుచు మూడవది యగు భగవత్సాయుజ్యమును బొందవలెను. పైన దెల్పిన మూడు స్థితులలో మొదటిది సామీప్యము, రెండవది సారూప్యము, మూడవది సాయుజ్యము. సామాన్యముగ కొందఱు భగవంతుని గూర్చి శాస్త్రాదులవలన ఒకింత తెలిసికొని అంతయు తెలిసినదని తృప్తినొంది సాధనను విరమింతురు. ఇది సరికాదు. అట్టివాడు పూర్ణత్వమును బొందజాలడు. అతడింకను ముందుకుపోయి, భగవానుని ప్రత్యక్షముగ దర్శించుటకు, అతనిలో ఐక్యమొందుటకు యత్నింపవలెను. కనుకనే శ్రీకృష్ణమూర్తి కేవలము 'జ్ఞాతుమ్' అని చెప్పి ఊరుకొనక, 'ద్రష్టుమ్', 'ప్రవేష్టుమ్' అని కూడ వచించిరి.

ఒక మంచి ఫలము బజారునందు కలదనియు, దాని వర్ణము, రుచి, విలువ ఇట్టిదనియు ఒకడు ఇంటివద్ద కూర్చొని మఱియొకని ద్వారా తెలిసికొనెను - అనుకొనుడు. వెంటనే దానినిగూర్చి యాసక్తి గలిగి బజారునకు వెళ్ళి దానిని చూచును. చూచిన పిదప ఇంకను ఆసక్తి కలిగి దానిని కొని భుజించును. ఇచ్చోట, మొదటి స్థితి 'జ్ఞాతుమ్' అని భగవానుడు చెప్పినదానికి సరిపోవును. (భగవంతుని గూర్చి సద్గురువుల వలన, సచ్ఛాస్త్రముల వలన తెలిసికొనుట). అట్లే రెండవ స్థితి 'ద్రష్టుమ్' అనుదానికి సరిపోవును. (సాధనాభ్యాసములచే భగవంతుని ప్రత్యక్షముగ గాంచగల్గుట). మూడవ స్థితి 'ప్రవేష్టుమ్' అను పదమునకు సరిపోవును. (సాధన పరిపక్వముచే భక్తుడు భగవంతునియందైక్యమగుట). ఇదియే జీవన్ముక్త దశ, మోక్ష స్థితి. ఒక ఇంటిని గూర్చి తెలిసికొనుట, తెలిసికొనిన పిమ్మట దానిని సమీపించుట, తదుపరి ఇంటిలో ప్రవేశించుట యెట్లో, అట్లే భగవంతుని గూర్చియు నెఱుంగవలయును. ప్రతివారును అనన్యభక్తి యొక్క సమాశ్రయముచే భగవదైక్య రూపమగు అద్వైత పరాకాష్ఠ స్థితిని జీవితములో తప్పక పొందియే తీరవలెను. అప్పుడే సంసారదుఃఖమంతమగును.

'యదాహ్యేవైష ఏతస్మిన్నుదరమన్తరం కురుతే అథ తస్య భయం భవతి' అను ఉపనిషద్వాక్యానుసారము భగవంతునకు తనకు రవ్వంతైనను ఎడమున్నచో భయము జనించును. భయము గల స్థితి పూర్ణస్థితి యెన్నటికిని కానేరదు. కాబట్టి 'ప్రవేష్టుమ్( అను మూడవ దశను ప్రతి జీవితము అనన్యభక్తి యొక్క సాహాయ్యము పొంది కృతార్థుడు కావలయును.

కేవలము వేదపఠనాదులచే ముక్తి కలుగునని వచించినచో చదువురానివారు అక్కార్యమును చేయజాలరు. కనుక వారికి ముక్తి లేకపోవును. కేవలము తపస్సులచేగాని, యజ్ఞములచేగారి ముక్తి కలుగునని వచించినచో అవియు సర్వులకు అందుబాటులో లేవు. గనుక అందఱును చేయజాలరు. కేవలము దానములచే మోక్షము సిద్ధించునని చెప్పినచో బీదవారు దాని నాచరింపలేరు, కావున వారికిన్ని ముక్తిలేకపోవును. భక్తిచేతను భగవద్దర్శనము (భగవదైక్యము) చేకూరగలదని ఇచ్చట చెప్పుట వలన, అది సులభముగా నుండుటచేతను, సర్వులకును అందుబాటులో నుండుటచేతను ఎల్లరకును అవలంబనీయమై యొప్పుచున్నది. కావున జీవరాశుల యెడల కరుణ గలిగి ఇట్టి సర్వజన సులభమగు మోక్షసాధనమును భగవానుడిచట తెలిపినవారైరి.

- (తరువాయి వచ్చే సంచికలో)

SOUTHERN TRAVELS™
happy holidaying...
SOUTHERN TRAVELS PVT.LTD.
(Recognised by Ministry of Tourism. Govt. of India) Since 1970
18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi - 05.
Tel. : 011-4353 2800 (100 Lines), 2875 3466
Fax : 011-2875 7308, 4250 2090
e-mail : info@southerntravels.in
Winners of National Award as "The Best Domestic Tour Operator"
2 Times in a row securing 1st Position in India from the Ministry of Tourisim, Govt. of India
Book online through www.southerntravels.com
Our Tour Packages, Hotels in India & Domestic / Flight Tickets
Chennai : 044-2538 5253 Mumbai : 022 - 2501 0027
Vijayawada : 0866 - 257 6624 Vizag : 0891 - 274 5565
Bangalore : 080 - 2226 2633, Hyderabad : 040 - 2331 8866

క్రొత్త ఢిల్లీలో ఆంధ్రా హోటల్ HOTEL SOUTHERN
ఢిల్లీలోని తెలుగువారి ఏకైక వాణిజ్య సంస్థ
HOTEL SOUTHERN™
style. comfort. enjoy.
ఆధునిక ప్రయాణ సౌకర్యాలతో, ఉత్తర భారత యాత్రలు నిర్వహిస్తూ ప్రతితెలుగింటా సుపరిచితమైన సదరన్ ట్రావెల్స్ వారి అనుబంధ సంస్థ "HOTEL SOUTHERN, Karol Bagh, New Delhi లోని ప్రముఖ వ్యాపార కూడలిలో, అధునాతన సౌకర్యములతో నిర్మింపబడి, 100 రూములు, Business Centre, విజయవాడ / అమరావతి రెస్టారెంట్లు గల హోటల్ సదరన్‌లో విడిది చేయగలరు.
Free pick up from Nizamuddin / New Delhi Railway Stations and Domestic Airport